క్లుప్తంగా

పేదల ఆరోగ్యంపై ఇంత నిర్లక్ష్యమా..



వైద్యాధికారి చౌదరిని నిలదీస్తున్న సీపీఎం నాయకులు

ఉరవకొండ: పేదల ఆరోగ్యం అంటే మీకు ఇంత నిర్లక్ష్యమా? నెల నెలా లక్షలాది రూపాయల జీతాలు తీసుకుంటున్నా వైద్యం అందించారా? అంటూ సీపీఎం నాయకులు రంగారెడ్డి, మధుసూదన్ తీవ్రస్థాయిలో వైద్యుల నిర్లక్ష్యంపై ధ్వజమెత్తారు. ఐదేళ్ల బాలుడు అహరన్‌కుమార్ వైద్యం అందక చనిపోవడాన్ని నిరసిస్తూ శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ఎదుట సీపీఎం నాయకులు ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా సీపీఎం నాయకులు మాట్లాడుతూ స్వయానా రాష్ట్ర ఆర్థిక మంత్రి కేశవ్ ప్రాతినిధ్యం వహిస్తున్న ఉరవకొండలో పేదలకు వైద్యసేవలు అందడం లేదన్నారు. పేదల ఆరోగ్యం అంటే ఇంత చిన్నచూపా అంటూ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ చౌదరిను సీపీఎం నాయకులు నిలదీశారు. వైద్యులు ఇంత నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తీసుకోరా అంటూ ప్రశ్నించారు. అనంతరం పోలీసులు రంగ ప్రవేశం చేసి సీపీఎం నాయకుల ఆందోళన విరమింప చేశారు.

వైద్యం కోసం పడిగాపులు..



వైద్య సేవలందిస్తున్న స్టాఫ్ నర్సు నీలావతి

కూడేరు: వైద్యం కోసం శనివారం కూడేరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మండల ప్రజలు పడిగాపులు కాచారు. ఉన్న ఒక్క డాక్టర్ ఉషారాణి మండలంలోని మరుట్ల-3వ కాలనీలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజిషియన్ కార్యక్రమానికి వెళ్లారు. వైద్యం కోసం పీహెచ్‌సీకి అధిక సంఖ్యలో ప్రజలు రావడంతో స్టాఫ్ నర్సు నీలావతి వైద్య సేవలందించారు. ఆమె ఒక్కరే ఓపీ చూసుకుంటూ ఇంజెక్షన్లు వేయడంతో వైద్య సేవలు పొందేందుకు రోగులు గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. ఈ పీహెచ్‌సీ 24 గంటల ఆస్పత్రి. రోజుకు 120-180 దాకా ఓపీ ఉంటుంది. ఇక్కడ ఇద్దరు డాక్టర్లు ఉండాలి. కానీ ఒక డాక్టర్ పోస్టు ఖాళీ ఉంది. ఉన్న వైద్యురాలు 104, ఇతర వైద్య క్యాంపులు, సమావేశాలకు వెళ్లినపుడు స్టాఫ్ నర్సే రోగులకు వైద్య సేవలందించాల్సి వస్తోంది. దీంతో వైద్య సేవలు సక్రమంగా అందక రోగులు అవస్థలు పడుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి ఖాళీ ఉన్న డాక్టర్ పోస్టును భర్తీ చేయాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ఊబకాయంతో సమస్యలు



పోస్టర్లను విడుదల చేస్తున్న సీడీపీఓ శ్రీదేవి

కూడేరు: చక్కెర, నూనెతో తయారు చేసిన ఆహార పదార్థాలను ఎక్కువగా తింటే బరువు పెరిగి ఊబకాయం ఏర్పడి అనేక ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి తెలిపారు. శనివారం కూడేరులో పోషణ మాసోత్సవాల్లో భాగంగా చక్కెర, నూనె వాడకంతో కలిగే అనర్థాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఊబకాయం పెరిగితే గుండె జబ్బులు, మధుమేహం(షుగర్), కేన్సర్ వంటి తీవ్రమైన ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. చక్కెర, నూనె వాడకాన్ని తగ్గించాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ సురేఖ, అంగన్‌వాడీ కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

నవ దుర్గల దర్శనం.. భక్తజన పరవశం



ఆకట్టుకుంటున్న నవ దుర్గ మాతల అలంకరణ

రాయదుర్గంటౌన్: పట్టణంలోని ప్రజాపిత ఈశ్వరీయ విశ్వ విద్యాలయం (ఓంశాంతి నిలయం) కార్యాలయంలో శరన్నవరాత్రుల ఉత్సవంలో భాగంగా శనివారం నవదుర్గ దేవీల దర్శనం భక్తజనులను పరవశులను చేసింది. చిన్నారులతో ప్రదర్శించిన దుర్గాదేవి, లక్ష్మీదేవి, సరస్వతీదేవి, పార్వతీదేవి, అన్నపూర్ణదేవి, కాళీదేవి, గాయత్రీదేవి, కన్యకా పరమేశ్వరీదేవి అలంకరణ దర్శనం ఆకట్టుకుంది. విశ్వ విద్యాలయం సంచాలకురాలు బీకే యోగీశ్వరి మాట్లాడుతూ దసరా, నవరాత్రులు, సద్గుణాలు, నవమి విశిష్టతను వివరించారు.

మోతాదు మించితే ముప్పే!

- అధికంగా ఎరువులు, పురుగుమందుల వినియోగం
- భూముల నిస్సారం.. ఆహార నియమావళికి దెబ్బ
- జాగ్రత్తలు తీసుకోవాలంటున్న వ్యవసాయ నిపుణులు



ఎరువులు చల్లుతున్న రైతు (ఫైల్)

రాయదుర్గం: ఎరువులు, పురుగు మందులు మోతాదుకు మించి వినియోగిస్తుండడంతో నేలలో కాలుష్యం ఏర్పడి భూములు నిస్సారవంతంగా మారుతున్నాయి. వీటిలో పండించే పంట ఉత్పత్తులపై రసాయనాల ప్రభావం పెరిగి కొత్త రకం తెగుళ్లు పుట్టుకొస్తున్నాయి. ఫలితంగా ఆహార నియమావళి దెబ్బతినే ప్రమాదం పొంచి ఉందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. శక్తివంతమైన మందుల వినియోగం పెరిగిపోవడంతో అన్ని విధాలా నష్టం చేకూర్చే ప్రతికూల పరిస్థితులు రైతుకు ఎదురవుతున్నాయి. ఈ దుష్ఫలితాలు దూరం కావాలంటే సేంద్రియ ఎరువుల వినియోగం పెంచాలి. భూసార పరీక్షలకు అనుగుణంగా రసాయనిక ఎరువులు చల్లాలి. అప్పుడే ఆశించిన స్థాయిలో దిగుబడులు సొంతమవుతాయి. రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో ఖరీఫ్ వరి సాధారణ సాగు విస్తీర్ణం 11,113 హెక్టార్లు కాగా, ప్రస్తుతం 14,666 హెక్టార్లలో సాగైంది. అత్యధికంగా హెచ్చెల్సీ ఆయకట్టులో వరి సాగులోకి వచ్చింది. అన్నిచోట్ల వ్యవసాయ పనులు పూర్తయ్యాయి. వరి పొట్టదశకు చేరింది. ఎరువులు, పురుగు మందుల వినియోగంపై రైతులు దృష్టి సారిస్తున్నారు. ఈ నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

వరిసాగు వివరాలు (హెక్టార్లలో)

నియోజకవర్గం	సాధారణ సాగు	సాగైన విస్తీర్ణం
రాయదుర్గం	9,267	11,759
ఉరవకొండ	1,008	2,138
కళ్యాణదుర్గం	838	796

భూసార పరీక్షలు కీలకం



భూసార పరీక్షల ఆధారంగానే పంట సాగుతో పాటు ఎరువులు వినియోగించాలి. వాడకం అధికమైతే భూమిలో నిస్సారం పెరిగి చౌడుగా మారే అవకాశం ఉంది. సహజ సిద్ధమైన సేంద్రియ ఎరువులపై రైతులు దృష్టి సారించాలి. అప్పుడే ఆశించిన దిగుబడులు సాధ్యమవుతాయి. మోతాదుకు మించి రసాయన ఎరువులు వినియోగించడం మంచిదికాదు. – పద్మజ, ఏడీఏ, రాయదుర్గం

రుణాలు సద్వినియోగం చేసుకోవాలి



మేళాలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: పీఎం స్వానిధి 2.0 కింద వీధి విక్రయదారులకు బ్యాంకుల ద్వారా మంజూరయ్యే రుణాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి చెందాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప, కమిషనర్ దివాకర్‌రెడ్డి సూచించారు. పట్టణంలోని బళ్లారి రోడ్డులోని ఆంజనేయస్వామి కల్యాణ మంటపంలో శనివారం 'లోక కళ్యాణ మేళా' నిర్వహించారు. 264 మంది వీధి విక్రయదారుల నుంచి (స్ట్రీట్ వెండర్స్) బ్యాంకు అధికారులు రుణ దరఖాస్తులను స్వీకరించారు. మొదటి విడత రూ.15 వేలు, రెండో విడత రూ.25 వేలు, మూడో విడత రూ.50 వేల చొప్పున రుణం మంజూరు చేస్తామని అధికారులు తెలిపారు. మేళాతో పాటు వీధి విక్రయదారులు, వారి కుటుంబ సభ్యులకు అర్బన్ హెల్త్ సెంటర్ వైద్య బృందంచే ఆరోగ్య వైద్య శిబిరం నిర్వహించారు. దాదాపు 380 మందికి మొదటి విడతలో వీధి వ్యాపారులకు ఐడీ కార్డులను పంపిణీ చేశారు. అలాగే హాజరైన వీధి వ్యాపారులందరికి డిజిటల్ పేమెంట్స్‌పై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్, సీడీపీఓ పద్మావతి, కౌన్సిలర్లు శారదాదేవి, ప్రశాంతి, జ్యోతి, పద్మజ, టీపీవో సుబ్బరాయుడు, టీఎంసీ నారాయణరెడ్డి, మెప్మా సీఓలు పాల్గొన్నారు.

వేలం నిర్వహించకుండా బార్ ఏర్పాటు

- సీఎం, మంత్రులకు వేలం పాటదారుల ఫిర్యాదు

ఉరవకొండ: ఉరవకొండ మేజర్ గ్రామ పంచాయతీలో ఎలాంటి టెండర్లు నిర్వహించకుండా బార్ అండ్ రెస్టారెంట్ ఏర్పాటు చేశారని, దీన్ని ఎలా నిర్వహిస్తారని గత ఏడాది మద్యం షాపుల టెండర్లలో పాల్గొని రూ.2లక్షలు నష్టపోయిన పాటదారులు ఆరోపించారు. శనివారం లిఖిత పూర్వకంగా సీఎం చంద్రబాబుతో పాటు రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో పాటు జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులకు రిజిస్టర్ పోస్టు ద్వారా విన్నవించారు. ఈ సందర్భంగా గతంలో వేలంలో పాల్గొన్న పెట్రోల్ బంకు సత్తెన్న, లాయర్ శీనా, సామ్రాట్, శ్రీరాములు, రాఘవేంద్ర, భీమప్ప, హరికృష్ణప్రసాద్ తదితరులు మాట్లాడుతూ మేజర్ పంచాయతీలో బార్ అండ్ రెస్టారెంట్‌కు ఎలాంటి అనుమతులు లేవని, వీటి నిర్వహణకు టెండర్లు కూడా పిలవలేదన్నారు. దీని పై ఎక్సైజ్ శాఖ అధికారులను అడిగినా బార్‌కు ఎలాంటి అనుమతులు లేవని స్పష్టం చేశారన్నారు. అనుమతులు లేకుండా నిబంధలకు విరుద్ధంగా బార్ ఎలా నిర్వహిస్తారో చెప్పాలన్నారు. ఈ బార్‌కు సహకరిస్తున్న కొందరు అధికారుల పై ప్రభుత్వం చర్యలు తీసుకుని.. బార్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

మాతా.. కరుణించు..

రాయదుర్గం, కళ్యాణదుర్గం, ఉరవకొండ నియోజకవర్గాల్లో దసరా నవరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం ఆలయాల్లో అమ్మవారు వివిధ రూపాల్లో భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. -సాక్షి బృందం



గోవిందవాడలో చీరల అలంకరణలో వాసవి మాత



కణేకల్లులో బాలత్రిపుర సుందరీదేవిగా అమ్మవారు




రాయదుర్గంలో మహాలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి



ఉరవకొండలో లలిత త్రిపుర సుందరిగా జగదీశ్వరి



ఉరగాద్రి చౌడేశ్వరీ ఆలయంలో లలిత త్రిపుర సుందరిగా..



కళ్యాణదుర్గంలో రాజరాజేశ్వరీదేవిగా వాసవీమాత



వజ్రకరూరులో లలితాదేవిగా మారెమ్మ



కూడేరులో లలితాదేవిగా సుంకులమ్మ దేవి

అన్యాయంగా మమ్మల్ని బలిచేయొద్దు



మాట్లాడుతున్న స్టాఫ్ నర్సులు

ఉరవకొండ: విధి నిర్వహణలో వైద్యులు సూచించిన మేరకు చికిత్స అందించే మా మీద అభాండాలు వేసి బలిచేయొద్దు అని ఉరవకొండ ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే స్టాఫ్‌నర్సులు ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం స్టాఫ్‌నర్సులు ప్రియాంక, అంజనలు మాట్లాడుతూ గత ఐదేళ్లుగా ఆస్పత్రిలో ఎలాంటి ఫిర్యాదు లేకుండా రోగులకు సేవలందిస్తున్నామన్నారు. వైద్యాధికారుల సూచనల మేరకు వైద్యం అందించడంలో ఎక్కడా నిర్లక్ష్యం వహించలేదన్నారు. ఈ నెల 26న చాబాల గ్రామానికి చెందిన అహరోహన్‌కుమార్ మృతి చెందిన ఘటనలో స్టాఫ్ నర్సులుగా తమ తప్పిదం లేదన్నారు. డాక్టర్ ఇస్మాయిల్ సూచన మేరకే ఇంజెక్షన్ వేసి, సెలైన్ పెట్టామన్నారు. బాలుడి ఆరోగ్య పరిస్థితిపై నిరంతరం వైద్యాధికారికి సమాచారం అందించామన్నారు. అయితే బాలుడు డీహైడ్రేషన్‌కు గురై వాంతులు చేసుకోవడంతో తెల్లవారుజామున 4 గంటలకు డాక్టర్‌కు సమాచారం ఇచ్చి పరీక్షించేలా చూశామన్నారు. ఇందులో ఎక్కడా తమ నిర్లక్ష్యం లేదన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి స్టాఫ్‌నర్సులు పాల్గొన్నారు.

ప్రజలకు బాధ్యతతో సేవలందించాలి



డంపింగ్ యార్డును పరిశీలిస్తున్న మున్సిపల్ ఆర్డీ నాగరాజు

కళ్యాణదుర్గం రూరల్: ప్రజలకు బాధ్యతతో సేవలు అందించాలని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ నాగరాజు సచివాలయ సిబ్బందికి సూచించారు. శనివారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ వివిధ సమస్యలతో కార్యాలయాలకు వచ్చే ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించాలన్నారు. మున్సిపాలిటీ మాస్టర్ ప్లాన్ అమలుపై అభినందిచారు. అనంతరం కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు. పట్టణంలోని డంపింగ్ యార్డ్‌ను పరిశీలిచారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వంశీ, డీఈ శ్రీకాంత్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ నూర్‌అలీఖాన్ పాల్గొన్నారు.

సిలిండర్ల డెలివరీలో అవకతవకలు



ఇన్‌స్పెక్టర్ శంకర్‌కు ఫిర్యాదు చేస్తున్న స్థానికులు

బొమ్మనహాళ్: గ్యాస్ సిలిండర్ డెలివరీలో అవకతవకలు జరిగినట్లు తూనికలు, కొలతల శాఖ అధికారుల తనిఖీల్లో తేలింది.'అధనం చెల్లిస్తేనే.. సిలిండర్' శీర్షికన 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించి.. శనివారం బొమ్మనహాళ్‌లో దాడులు నిర్వహించారు. సిలిండర్ డెలివరీ వాహనంలో తూకం వేసే మిషన్ లేకపోవడంతో పాటు గ్యాస్ సరఫరా ధ్రువీకరణ పత్రం చూపించకపోవడంతో గ్యాస్ ఏజెన్సీ నిర్లక్ష్యం బయటపడింది. దీంతో తూనికలు, కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్ రూ.10 వేల జరిమానా విధించారు. వినియోగదారుల నుంచి సిలిండర్‌పై అదనంగా డబ్బు వసూలు చేస్తున్నట్లు వినియోగదారులు ఇన్‌స్పెక్టర్ దృష్టికి తీసుకొచ్చారు. ఇంటి వద్ద డెలివరీ చేయాల్సిన సిలిండర్‌ను రోడ్డుపైనే పడేస్తున్నారని వాపోయారు. డబ్బు అదనంగా వసూలు చేసి, సిలిండర్లు కూడా సరిగా ఇవ్వడం లేదని ఈ ఏజెన్సీపై కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. మరోసారి తూకం లేకుండా సిలిండర్లు డెలివరీ చేస్తే ఏజెన్సీ రద్దుకు ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఇన్‌స్పెక్టర్ హెచ్చరించారు.

కనకదాస విగ్రహ ప్రతిష్టను జయప్రదం చేయండి



పోస్టర్లు విడుదల చేస్తున్న కురుబ సంఘం నాయకులు

బొమ్మనహాళ్: తిరుపతిలో అక్టోబర్ ఐదో తేదీన భక్త కనకదాస విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కురుబ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎస్.కె.మల్లికార్జున, మండల అధ్యక్షుడు నాగారాజు కోరారు. శనివారం బొమ్మనహాళ్‌లో కనకదాస విగ్రహ ప్రతిష్ట పోస్టర్లను విడుదల చేశారు. కురుబ సంఘం నాయకులు పెద్ద ఎత్తున పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో కురుబ సంఘం నాయకులు ఫొటో బసవరాజు, దిలీప్, లేపాక్షి, కెంచప్ప తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల కొరత లేకుండా చూడండి



మున్సిపల్ ఆర్డీ నాగరాజుతో సమావేశమై చర్చిస్తున్న చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప

రాయదుర్గంటౌన్: మున్సిపాలిటీలో పారిశుధ్య కార్మికుల కొరతను తీర్చాలని చైర్‌పర్సన్ పొరాళ్ల శిల్ప మున్సిపల్ ఆర్డీ నాగరాజును కోరారు. శనివారం మున్సిపాలిటీ తనిఖీకి వచ్చిన ఆర్డీని చైర్‌పర్సన్ మర్యాదపూర్వకంగా కలిసి సమస్యలపై చర్చించారు. ముఖ్యంగా పారిశుద్ధ కార్మికుల కొరతతో పట్టణంలో శానిటేషన్ సమస్య నెలకొందన్నారు. కాంట్రాక్ట్ ప్రాతిపదికన కార్మికులను నియమించుకునేలా కృషి చేయాలని కోరారు. తరచూ పైప్‌లైన్ లీకేజీలు ఏర్పడకుండా అవసరమైన మెటీరియల్ సరఫరా చేయాలన్నారు. సమావేశంలో కమిషనర్ దివాకర్‌రెడ్డి, డీఈ సురేష్, ఏఈ నరసింహులు, కౌన్సిలర్ శారదాదేవి పాల్గొన్నారు.

విధుల్లో అలసత్వం వహిస్తే చర్యలు

రాయదుర్గం టౌన్: ప్రజా సమస్యల పరిష్కారంలో గానీ, విధి నిర్వహణలో కానీ అధికారులు, సచివాలయ సిబ్బంది అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని మున్సిపల్ రీజనల్ డైరెక్టర్ జి.నాగరాజు హెచ్చరించారు. శనివారం ఆయన రాయదుర్గం మున్సిపాలిటీని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విభాగాల వారీగా అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిశీలించి క్షేత్రస్థాయిలో పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. ఆస్తి, నీటి పన్నుల వసూళ్లను వేగవంతం చేయాలన్నారు. మొండి బకాయిలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని, అవసరమైన పక్షంలో రెడ్‌నోటీసు జారీ చేయాలన్నారు. అంతకుముందు ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఆర్‌డీ పలు విషయాలను వెల్లడించారు. పట్టణంలో తాగునీటి సమస్య, పారిశుధ్యంతోపాటు క్షేత్రస్థాయిలో గల అనేక సమస్యలు ఆయన దృష్టికి వచ్చాయి. సమావేశంలో ఆయనతోపాటు మున్సిపల్ కమిషనర్ దివాకర్ రెడ్డి, మేనేజర్ కిశోర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్

బ్రహ్మసముద్రం: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మండల వైద్యాధికారి డాక్టర్ రాజేష్‌కుమార్ పేర్కొన్నారు. శనివారం పాలవెంకటాపురం, సంతేకొండాపురం పంచాయతీల్లో స్వస్థనారీ – సశక్తి పరివార్ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆరోగ్యవంతంగా ఉండాలే ఉద్దేశంతో కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈఓఆర్డీ రంగనాయకులు, నోడల్ ఆఫీసర్ ఆఫ్తాబ్, సింగిల్‌విండో ప్రెసిడెంట్ ఓబులేష్, సర్పంచ్ మల్లెల వనిత, సీహెచ్‌ఓ రాణీ ఎస్తేర్, హెల్త్ సూపర్‌వైజర్లు రామలక్ష్మమ్మ, జాన్సన్, పంచాయతీ కార్యదర్శి అనిత, ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు ,ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ఘనంగా వాల్మీకి విగ్రహ ప్రతిష్ట



విగ్రహావిష్కరణలో పాల్గొన్న నాయకులు

కుందుర్పి: మండల సరిహద్దున గల వైఎన్‌ఎస్ కోటలో శనివారం మహర్షి వాల్మీకి విగ్రహప్రతిష్ట కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా కర్ణాటక రాష్ట్ర వాల్మీకి సంఘం ఉపాధ్యక్షుడు బీఎన్ నాగరాజు, వాల్మీకి ఉపాధ్యాయ సంఘం నాయకులు అశ్వర్థనారాయణ హాజరయ్యారు. పెద్ద సంఖ్యలో వాల్మీకులు పాల్గొన్నారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం అధ్యక్షుడు యాదగిరి వెంకటేష్, నాయకులు వెంకటరమణప్ప వాల్మీకి సంఘం మండల సహాయ కార్యదర్శి బాబయ్య గుడి శీనప్ప తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి మృతి



మృతి చెందిన నాగరాజు

రాయదుర్గంటౌన్: పట్టణంలో ఈ నెల 18న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కర్నూలు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఎర్రిస్వామి నాగరాజు (60) శుక్రవారం రాత్రి మృతి చెందాడు. ఈయనకు భార్య, ఇద్దరు కుమారులు, ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఇదే ప్రమాదంలో నాగరాజుతో పాటు రోడ్డు దాటుతున్న రాయదుర్గానికి చెందిన ఓబులేసు కూడా బస్సు ఢీకొని తీవ్రంగా గాయపడి మృతి చెందిన సంగతి విదితమే. ఈ ఘటనతో రెండు కుటుంబాల్లో తీవ్ర విషాదం నెలకొంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పుస్తకాల ఆవిష్కరణ

కళ్యాణదుర్గం రూరల్: పట్టణంలోని పెన్షనర్స్ భవన్‌లో శనివారం సత్యనారాయణ రచించిన అక్షర విన్యాసాలు, తెలుగు పద బాలశిక్ష పుస్తకాలను ఆవిష్కరించారు. ప్రముఖ కవి విమర్శకులు రాజారామ్ అధ్యక్షతన వహించారు. కార్యక్రమంలో విశ్రాంతి భవన్ సెక్రటరీ తిప్పేస్వామి, విశ్రాంత ఉద్యోగులు మారెప్ప, గంగప్ప, చల్లా కిశోర్, నారాయణ, బద్దె నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

జాగ్రతలు పాటించాలి

కూడేరు: ఆరోగ్యంగా ఉండాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా జాగ్రతలు పాటించాలని మండల వైద్యాధికారిణి ఉషారాణి సూచించారు. శనివారం మండలంలోని మరుట్ల-3వ కాలనీలో ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ కార్యక్రమంలో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన వారిని డాక్టర్ ఉషారాణి పరీక్షించి వైద్య సేవలందించారు. అవసరమైన వారందరికీ మందులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఈ-పాస్ మిషన్ల పంపిణీ

రాయదుర్గంటౌన్: రాయదుర్గం అర్బన్, మండల పరిధిలోని 55 చౌకధాన్యపు డిపో డీలర్లకు అధునాతన ఈ-పాస్ మిషన్లను తహసీల్దార్ నాగరాజు శనివారం పంపిణీ చేశారు. తహసీల్దార్ కార్యాలయంలోని సమావేశ భవనంలో జరిగిన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ శ్యామ్‌తో కలిసి డీలర్లకు అందజేశారు. తహసీల్దార్ మాట్లాడుతూ ఆండ్రాయిడ్ మైక్రో కంట్రోలర్ ఆధారిత, ఆధార్ ఆధారిత బయోమెట్రిక్ గుర్తింపు, టచ్ స్క్రీన్ ఇంటర్ ఫేస్ డేటా ప్రాసెసింగ్ కలిగి కొత్త ఈ పాస్‌యంత్రాల ద్వారా అక్టోబర్ నుంచి సరుకుల పంపిణీ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో స్టోరు డీలర్ల సంఘం అధ్యక్షుడు సత్తి, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ మృతి

విడపనకల్లు: మండల పరిధిలోని ఆర్.కొట్టాలకు చెందిన మాజీ సర్పంచు ఓబుళమ్మ(70) శనివారం మృతి చెందారు. 2014-19 వరకూ ఆమె సర్పంచుగా పని చేశారు. విషయం తెలుసుకున్న మాజీ ఎంపీపీలు ప్రతాప్‌నాయుడు, బోయ నాగలక్ష్మి, బోయ బస్సన్న తదితరులు మృతదేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు సానుభూతి తెలిపారు.

పరిసరాల పరిశుభ్రత తప్పనిసరి

వజ్రకరూరు: ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతోపాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని వైద్యాధికారి మారుతి సూచించారు. శనివారం మండలంలోని చాబాలలో గడేహోతురు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచు మల్లెల జగదీష్, ఆరో గ్య విస్తరణ అధికారి విజయ్‌కుమార్, హెల్త్ అసిస్టెంట్ చంద్ర, ఎంఎల్‌హెచ్‌పీ పావని తదితరులు పాల్గొన్నారు.

తల్లీబిడ్డల వివరాలు తప్పనిసరిగా నమోదు చేయండి

కణేకల్లు: తల్లీబిడ్డల ఆరోగ్య వివరాలను ఏబీహెచ్‌ఏ (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) ఐడీలో తప్పనిసరిగా నమోదు చేయాలని కణేకల్లు సీడీపీఓ నాగమణి పేర్కొన్నారు. పోషణ మాసోత్సవాల సందర్భంగా శనివారం మండలంలోని ఎస్.హనుమాపురం-1, 2 అంగన్‌వాడీ కేంద్రాల్లో సమావేశం నిర్వహించారు. సీడీపీఓ మాట్లాడుతూ తల్లీబిడ్డలకు సంపూర్ణ ఆరోగ్యం అందించేందుకు ఏబీహెచ్‌ఏ ఐడీలో ఎప్పటికప్పుడు సమాచారాన్ని అప్‌లోడ్ చేయనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సెక్టార్ సూపర్‌వైజర్ ఈశ్వరమ్మ, బ్లాక్ కో ఆర్డినేటర్ వెంకటరంగయ్య, అంగన్‌వాడీ వర్కర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.